



## నిమ్స్‌లో రోబోటిక్ సర్జరీ

నిమ్స్ దవాఖానలో రోబోటిక్ సర్జరీ సిస్టం అందుబాటులోకి వచ్చింది. సోమవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించి పనితీరును పరిశీలించారు. వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 5 నుంచి రోగులకు వైద్యసేవలు అందించనున్నారు. అదేవిధంగా 2డీ సి-ఏఆర్ఎం సేవలను సైతం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్, టీఎస్ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రియల్ గురువు 'భాగ్యనగరి'

**దేశానికి రియల్ పాఠాలు నేర్పుతున్న హైదరాబాద్**

*తెలంగాణ వస్తే రియల్ ఎస్టేట్ పడిపోతుందంటూ గగ్గోలు పెట్టిన నోర్లు.. ఇప్పుడు రాష్ట్ర అభివృద్ధిని చూసి నివ్వెర పోతున్నాయి. ఒకప్పటి హైదరాబాద్‌కు ఇప్పటి హైదరాబాద్‌కు చాలా మార్పు వచ్చింది. తొమ్మిదేళ్లుగా క్రమక్రమంగా అభివృద్ధి చెందుతూ ఊహకందని రీతిలో రూపాంతరం చెందుతున్నది. ప్రణాళికబద్ధమైన ప్రభుత్వ నిర్ణయాలు, వరల్డ్ క్లాస్ మౌలిక వసతులు, ఇండస్ట్రీయల్ ఫ్రెండ్లీ విధానాలు, గ్లోబల్ సిటీయే లక్ష్యంగా అమలు చేస్తున్న సంస్కరణలతో రియల్ ఎస్టేట్‌కు హైదరాబాద్ దిక్సూచిలా నిలుస్తున్నది. ఇతర రాష్ట్రాల రియల్ వ్యాపారులు నగరానికి వచ్చి అధ్యయనం చేసేంత స్థాయికి చేరుతున్నది. ఒకప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారమంటే ఢిల్లీ, ముంబాయి, గుర్గావ్, బెంగళూరు వైపు చూసే సందర్భాలు ఉండేవి. కానీ రియల్ వ్యాపారాన్ని నలుదిశలా విస్తరిస్తూ దేశానికి రియల్ పాఠాలు చెప్పేంత స్థాయిలో హైదరాబాద్ సగర్వంగా నిలబడుతున్నది.*

**- సిటీబ్యూరో, జూలై 3(నమస్తే తెలంగాణ)**





- ఇతర రాష్ట్రాలకు దిక్సూచిలా మహానగరం
- నగరం నలుదిశల విస్తరిస్తున్న ఇండస్ట్రీ హబ్
- దేశంలోనే ఎక్కువ ఎత్తైన భవనాలు కలిగిన నగరాల జాబితాలో భాగ్యనరానికి రెండో స్థానం
- ఆకట్టుకుంటున్న రియల్ ఎస్టేట్ ఫ్రెండ్లీ విధానాలు
- ఆకర్శిస్తున్న అంతర్జాతీయ పెట్టుబడులు, మెరుగైన మౌలిక వసతులు, పుష్కళ మైన ల్యాండ్
- ఇతర రాష్ట్రాలకు గురువుగా మారుతున్న మనోళ్లు
- హైదరాబాద్ రియల్ గ్రోత్‌పై అధ్యయనం కోసం ఇంటర్ స్టేట్ రియల్ సంస్థల ఆసక్తి
- త్వరలోనే సందర్శనకు రానున్న ప్రతినిధులు

విశ్వనగరం వైపు వడివడిగా పరుగులు పెడుతున్న హైదరాబాద్ అన్ని రంగాలతోపాటు రియల్ ఎస్టేట్‌లోనూ ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నది. ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా విస్తరించిన వరల్డ్ క్లాస్ మౌలిక వసతులు, మణిహారంలాంటి అవుటర్ రింగ్ రోడ్డు, ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్‌ను వికేంద్రీకృతం చేసినట్లుగా నలుదిశల విస్తరిస్తున్న ఇండస్ట్రీ హబ్‌లతో నగరం రూపురేఖలు మారిపోయాయి. ఇవే రియల్ ఎస్టేట్ రంగంలో అంతర్జాతీయ స్థాయి సంస్థలు, అత్యధిక స్కై స్క్రాపర్లు, లగ్జీరియస్ ప్రాజెక్టులు, సిగ్నల్ ఫ్రీ విధానాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఇలాంటి అంశాలే రాష్ట్రాల రియల్ రంగ నిపుణులు, సంస్థలు, వ్యాపారులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తుండగా.. దేశానికి రియల్ వ్యాపారంలో దిశానిర్దేశం చేసేంతగా ఎదుగుతున్నది.

### మోస్ట్ హ్యాపెనింగ్ సిటీగా హైదరాబాద్

ఐటీ, ఫార్మా, హార్డ్‌వేర్, ఎలక్ట్రానిక్, డేటా సెంటర్ల వంటి ఎన్నో రంగాల్లో హైదరాబాద్ వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తున్నది. దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతోపాటు రియల్ ఎస్టేట్ అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. ఈ క్రమంలో పెరుగుతున్న డిమాండ్ తగినట్లుగా లగ్జరీ విల్లాలు, 50 ఫ్లోర్ల స్కై స్క్రాపర్లు, విశాలమైన భవంతులు, అల్ట్రామోడ్రన్ జీవనశైలిని అందించే రెసిడెన్షియల్ ప్రాజెక్టుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీనికి తోడు పుష్కళమైన ల్యాండ్ బ్యాంక్, ఇతర రాష్ట్రాల ధరలతో పోల్చితే తక్కువ ధరలో స్థిరాస్తుల లభ్యత, వైవిధ్యమైన నిర్మాణ శైలితో రియల్ రంగంలో మోస్ట్ హ్యాపెనింగ్ సిటీగా హైదరాబాద్ నిలుస్తున్నది. ఇలాంటి అంశాలే రియల్ ఎస్టేట్ రంగంలో మహానగరాన్ని అగ్రస్థానంలో నిలిపి, దేశానికి పాఠాలు చెప్పే స్థాయికి చేర్చుతున్నాయి.



### క్రెడాయ్ ఇండియా నేతృత్వంలో..

క్రమక్రమంగా జరుగుతున్న హైదరాబాద్ అభివృద్ధి, రియల్ ఎస్టేట్ తీరుతెన్నులను అధ్యయనం చేసేందుకు గతంలో మహారాష్ట్ర క్రెడాయ్ యూత్ వింగ్ సందర్శించారు. తాజాగా ఇదే తరహాలో దేశంలోని ప్రధాన రియల్ ఎస్టేట్ కేంద్రాలుగా ఉన్న ముంబాయి, గుర్గావ్, ఢిల్లీ వంటి ప్రాంతాల నుంచి రియల్ నిపుణులు, వ్యాపారులు, యంగ్ ఆంత్రప్రెన్యూర్లు హైదరాబాద్‌కు రానున్నారు. క్రెడాయ్ ఇండియా నేతృత్వంలో జరుగుతున్న ఈ స్టడీ టూర్‌లో దాదాపు 250 మంది పాల్గొంటారని క్రెడాయ్ ఇండియా జాతీయ కార్యదర్శి గుమ్మి రాంరెడ్డి తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగంలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించే క్రమంలో ఏటా దేశంలోని అత్యంత ఆదరణ, ఇండస్ట్రీ గ్రోత్ ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకొని పర్యటిస్తుంటారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ మార్పులపై అవగాహన కల్పించేందుకు ఈ టూర్ సాయపడుతుందని తెలిపారు. ప్రస్తుతం షెడ్యూల్ ఖరారు కాలేదని, హైదరాబాద్ స్టడీ టూర్ పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. ఈ పర్యటనలో భాగంగా ఉత్తమ విల్లాలు, లగ్జరీయస్ గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ నిర్మాణాలు, మోడ్రన్ సిటీ ఐకానిక్ సెంటర్ టీ హబ్‌ను సందర్శిస్తారని తెలిపారు.

### ఖరీదైన భవంతులకు కేరాఫ్..

ఇటీవల కాలంలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ సరికొత్త లక్ష్యాలను చేరుకుంటున్నది. దేశంలోనే ఎక్కువగా ఎత్తైన భవనాలను కలిగి ఉన్న నగరాల జాబితాలో రెండో స్థానంలో నిలిచింది. గడిచిన కొంతకాలంగా ఈ ట్రెండ్ తారా స్థాయికి చేరుతుంటే.. ఖరీదైన నిర్మాణాలకు హైదరాబాద్ అడ్డాగా మారుతున్నది. అఫర్డబుల్ ప్రాజెక్టుల నుంచి మొదలుకుంటే రూ.35 కోట్ల ఖరీదు చేసే భవనాల లభ్యత పెరిగింది. నిర్మాణ రంగంలో ఆధునిక టెక్నాలజీ, వినూత్నమైన ఆర్కిటెక్చర్, రాజభవనాలను తలపించేలా విశాలమైన క్లబ్ హౌజ్‌ల నిర్మాణానికి సిటీ డెవలపర్లు ప్రాధాన్యతనిస్తున్నారు. ఇవే రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు రావడంతో ఇతర ప్రాంతాల వారిని కూడా ఆకట్టుకుంటున్నదని రియల్ రంగ నిపుణులు చెబుతున్నారు.





సుందరంగా దర్శనమిస్తున్న పెద్దచెరువు

# గూడెం చెరువు.. ఓ మినీ ట్యాంక్‌బండ్



**పెద్ద చెరువు పిలుస్తున్నది**

- రూ.13 కోట్ల హెచ్ఎండీఏ నిధులతో సకల వసతులు
- పిల్లలకు, పెద్దలకు క్రీడాపరికరాలు
- పీర్జాదిగూడ చెరువు.. ఇతర కార్పొరేషన్లకు ఆదర్శం
- మంత్రి కేటీఆర్ ప్రశంసలు

పీర్జాదిగూడ, జూలై 3 : రాష్ట్ర ప్రభుత్వం చెరువుల సుందరీకరణకు చర్యలు చేపట్టడంతో పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని గూడెం చెరువు (పెద్ద చెరువు) మినీ ట్యాంక్ బండ్‌లా రూపుదిద్దుకున్నది. సుమారు 28 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు దుర్గంధం వెదజల్లడంతో పాటు రోజు రోజుకు కుచించుకు పోతుండటంతో అధికారులు చెరువు అభివృద్ధికి చర్యలు చేపట్టారు. రూ.13 కోట్ల హెచ్ఎండీఏ నిధులతో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దారు. పచ్చని చెట్లు, పూల మొక్కలు, వాకింగ్ ట్రాక్‌తో సందర్శకులను ఆకట్టుకుంటున్నది. మేయర్ జక్క వెంకట్ రెడ్డి నిత్యం అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ, అధికారులకు సూచనలు ఇస్తూ.. సకల వసతులతో కూడిన మినీ ట్యాంక్ బండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల మంత్రి మల్లారెడ్డి ప్రారంభించిన మినీట్యాంక్ బండ్ ఇతర మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఆదర్శంగా నిలుస్తున్నదని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రశంసలు కురిపించారు.




### చెరువు సుందరీకరణ ఇలా..

గూడెం చెరువుకు పర్యాటక శోభ తీసుకువచ్చేందుకు నిత్యం శ్రమించారు. చెరువులోకి ఎగువ ప్రాంతాలనుంచి వచ్చే డ్రైనేజీ నీటిని మూసీలోకి తరలించేందుకు కాలువలు, చెరువు చుట్టూ రిటర్నింగ్ వాల్ నిర్మించారు. చెరువుకట్టపై ఆహ్లాదంతో పాటు పచ్చదనంతో కూడిన వివిధ రకాల మొక్కలను ఏర్పాటు చేశారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా బతుకమ్మ ఘాట్, దసరా పండుగ జరుపుకునేందుకు విశాలమైన ప్రదేశం, స్వాగత తోరణం, పిల్లలకు క్రీడా మైదానం, ఓపెన్ ఎయిర్ జిమ్, వ్యూపాయింట్, హైమాస్ లైట్లు, వాకింగ్‌ట్రాక్, పార్కింగ్ వివిధ రకాల పూలమొక్కలతో సుదరంగా తీర్చిదిద్దారు. మురుగునీటిని పూర్తిగా తొలగించారు.



### పీర్జాదిగూడకే మణిహారం

రూ.13కోట్లతో పీర్జాదిగూడ పెద్ద చెరువును తీర్చిదిద్దాం. చెరువును పర్యాటక ప్రాంతంగా మార్చాం. పీర్జాదిగూడకు మణిహారంగా నిలిచింది. ఆహ్లాదంతో పాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇచ్చేలా రూపుదిద్దుకున్నది. ఇప్పుడు పర్యాటక శోభ తలపిస్తుంది.

– మేయర్ జక్కవెంకట్‌రెడ్డి, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్



మినీ ట్యాంక్ బండ్ పై ఆహ్లాద వాతావరణంలో పిల్లా పాపలతో వాకర్స్, సందర్శకులు